Ananth & Ananth Series



సూర్యదేవర రామ్ మోహన రావు

Author of Highest Number of Novels In Telugu

2019

125 వ నవల



# మనిషిలో మనిషి-1

# MANISHILO MANISHI -1st Part

(Serialised in ‘Swathi’ weekly)

By
**SURYADEVARA RAM MOHANA RAO**
Sri Venkata Anantha Sai Nilayam
Plot No.63, Road No.71
Nava Nirman Nagar, Jubilee Hills
Hyderabad - 500 096
E-mail : suryadevaranovelist@gmail.com
www.suryadevararammohanrao.com
www.suryadevaranovelist.com.

Published by:
**MODEL PUBLICATIONS**

Edition : **2019**

Price :
**₹. 100-00**

Cover Design :
**DURGA RAO**

Printers :
Vijayawada.

# మనిషిలో మనిషి -1

మానవ జీవితం దేవుడిచ్చిన వరం...

దేహమే ఒక దేవాలయం అంటారు విజ్ఞులు

ఏదిఏమైనా దేహం వుంటేనే జీవితం. ఇది వాస్తవం.

జిమ్‌రోహన్ అనే ఆధ్యాత్మికవక్త ఒక మాట చెప్పాడు- 'నీ శరీరాన్ని భద్రంగా కాపాడుకో. ఎందుకంటే నీవు నివశించగల చోటు అదొక్కటే'

**Take care of your Body. Its the only place you have to Live.**

ఇది చదవడానికి రెండు చిన్న వాక్యాలే కాని ఆలోచిస్తే ఇందులో కొండంత అర్థం, అంతులేని వాస్తవికత కన్పిస్తాయి.

శరీరాన్ని పొందాకే జీవుడు పసిగుడ్డుగా తల్లిగర్భం నుంచి ఈ మానవలోకంలోకి వస్తున్నాడు. దాన్ని పుట్టుక అంటున్నాం. నిండు జీవితం అనుభవించాక వృద్ధాప్యంలో జీవుడు ఆ శరీరాన్ని వదిలిపోతున్నాడు. దాన్ని గిట్టుట లేదా చావు అంటున్నాం. పుట్టుక, చావు ఈ రెంటి నడుమ గడిచే కాలమే జీవితం. అయితే ఎంతమంది ఇలా నిండు నూరేళ్ళు జీవితాన్ని అనుభవించగలుగుతున్నారు?

జీవికి భూమ్మీద నిలబడేది, మాట్లాడేది, సుఖదుఃఖాలు అనుభవించగలిగేది, అందమైన భూలోకాన్ని చూడగలిగేది అంతా శరీరం ఉంటేనే సాధ్యం. శరీరం జీవికి ఉపకరణం వంటిది. అలాంటి శరీరంపట్ల అజాగ్రత్తల కారణంగా అవి యమపాశమై ఎందరో ప్రాణాలను హరిస్తున్నాయి. శరీరంపట్ల, జీవితంపట్ల శ్రద్ధపెట్టనివారు నిండు నూరేళ్ళు జీవితాన్ని అనుభవించలేరు. ఇదే విషయాన్ని సింపుల్‌గా పై రెండు వాక్యాల్లోను చెప్పాడు జిమ్‌రోహన్.

భగవద్గీతలోకూడ గీతాచార్యుడు ఓ మాట చెప్పాడు. మనం చినిగిన వస్త్రాన్ని వదిలి నూతన వస్త్రాన్ని ధరించినట్టే జీవి శరీరాన్ని వదిలి మరో శరీరం పొందుతుందంటాడు. పుట్టినవారు మరణించక తప్పదు. మరణించినవారు తిరిగి పుట్టకా తప్పదు. అనివార్యమగు ఈ విషయాన్నిగూర్చి చింతింపతగదని హితవు చెప్తాడు. నిజమే.

కాని ఇక్కడ అసలు విషయం ఇదికాదు. మనిషి తన ప్రస్తుత శరీరాన్ని భద్రపర్చుకొని మరో శరీరంలోకిపోయి కొంత కాలం వుండి పిమ్మట తన ప్రస్తుత శరీరంలోకి చేరటం సాధ్యమా? దీన్నే సిద్ధులు పరకాయ ప్రవేశం అన్నారు. దీన్ని సైన్స్ అసాధ్యమంటుంది. కాని ఆధ్యాత్మిక నమ్మకం సాధ్యమే అంటుంది. ఒక్కోసారి అసాధ్యాలు కూడ సుసాధ్యమై అబ్బుర పరుస్తాయి. అరుదుగా సంభవించే అద్భుతాల్లో ఇదీ ఒకటి.

సాధారణంగా గొప్ప ఘనకార్యాలు సాధించిన వాళ్ళని కారణజన్ములు అంటుంటారు. కాని దేవుని దృష్టిలో, సృష్టిలో అందరూ సమానులే. కారణజన్ములే. అకారణంగా ఎవరూ యిక్కడ పుట్టరు. పుట్టినవారు తాము చేయాల్సిన పనులు ముగించే వెళ్ళిపోతూంటారు. దీనికి చిన్నాపెద్ద వంటి బేధంలేదు. నాటకరంగంలో పాత్రలవంటివి జీవితాలు. తమ పాత్ర నిర్వర్తించి అవసరం తీరగానే మరుగైపోతాయి.

ఈ విషయంగా ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ అనే భౌతికవాది ఓ మాట చెప్పాడు– 'ఒక గొప్ప శాస్త్రవేత్తను చూసి అతడి అమోఘమైన తెలివితేటలే అతన్ని అంత గొప్పవాడ్ని చేసాయంటారు. కాని అది తప్పు. జీవన నాటక రంగంలో అతడిదీ ఓ పాత్ర' అంటారు.

Most people say that it is the intellect which makes a great scientist.

They are wrong. It is charactor. - ALBERT EINSTEIN (Physicist)

ధర్మం అదుపు తప్పినప్పుడు దుష్టశిక్షణకు శిష్టరక్షణకు ప్రతి యుగంలోనూ తను అవతరిస్తానంటాడు గీతాచార్యుడు. నిజమే. న్యాయధర్మాలను కాపాడటం దైవకార్యం. మరి ఈ పుడమిని సుసంపన్నం చేయటం ఎవరి కార్యం? అది ఏ రంగమైనా కావచ్చు. వైద్య, విద్య, ఆరోగ్య, విజ్ఞాన, సాంకేతిక... ఒకటేమిటి? శాఖోపశాఖలుగా విస్తరించిన నేటి ఆధునిక విజ్ఞాన యుగం వెనక ఎందరో గొప్ప గొప్పవారి విశేషకృషి, తపన, తపస్సు దాగుంది. వారంతా తాము కనిపెట్టిన విషయాల్ని లోకానికి అందిస్తూ రావటంచేతనే నేడు మానవ జీవితం సుఖమయం అయింది.

అడవుల్లో జంతువులతో సహజీవనం చేసిన ఆదిమానవుల కాలం నుంచి మనం చూస్తున్న నేటి ఆధునిక కాలం వరకు అంచెలంచెలుగా పెరిగిన విజ్ఞాన యుగం వెనక ఎందరో అలుపెరగని శాస్త్రవేత్తల కృషి, త్యాగాలు వున్నాయి. వారంతా దైవాంశసంభూతులే. ధర్మాన్ని రక్షించటం

కోసమే కాదు, నిరంతర మార్పులతో మానవాళిని ఆరోగ్యంతోను, సుఖసంతోషాలతోను ఉంచడానికి అనేక రంగాల్లో దైవాంశసంభూతులు అవతరిస్తూనే వుంటారు. తమ కృషిని ఒక తపస్సులా భావించి కష్టనష్టాలకు ఓర్చుకొని కొత్త కొత్త ఆవిష్కరణలు మానవాళికి అందించి వెళ్ళిపోతూంటారు. ఇలాంటి కృషీవలురు అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ వుంటూనే వున్నారు.

అయితే పెరుగుట విరుగుట కొరకే అన్నట్టుగా వైజ్ఞానికంగా ఎంత అభివృద్ధి చెందినా, అంతకు రెట్టింపు వాతావరణం కలుషిత మైపోయి క్రమంగా మానవాళి మనుగడ ప్రమాదపు అంచులకు చేరుకుంటోంది ఈ దశలో.

గంగానది ప్రక్షాళన గురించి యమునా నది ప్రక్షాళన గురించీ మనం విన్నాం. కాని ఒక యువమేథావి, శాస్త్రవేత్త పంచభూతాలనూ ప్రక్షాళన చేయటం సాధ్యమేనంటూ ప్రపంచాన్ని విస్మయపరుస్తున్నాడు. ఈ భూగోళం మొత్తాన్ని శుద్ధిచేసి క్రీస్తుపూర్వంనాటి అద్భుతమైన వాతావరణాన్ని పరిశుద్ధమైన భూలోకాన్ని తిరిగి స్థాపిస్తానంటున్నాడు. అతడి వ్యాసాలు ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశాలయ్యాయి. ప్రకంపనలు సష్టిస్తున్నాయి. ఎవరా మేథావి? ఈ గాథకి పర్లాకిమిడి ప్యాలస్ వేదిక అయింది.

✧ ✧ ✧ ✧ ✧

ఆ రోజు ఉదయం-

పర్లాకిమిడి వీధుల్లోకి పాత అంబాసిడర్ కారు ఒకటి ప్రవేశించింది. దక్షిణ ఒరిస్సాలోని గజపతి జిల్లాలో ఆంధ్రా సరిహద్దుకు సమీపంలో వుంది పర్లాకిమిడి పట్టణం. మహేంద్ర తనయ నదీ తీరంలో వెలసిన పురాతన నగరం. ఆంధ్రప్రదేశ్‌కి చెందిన పాతపట్నం ఒరిస్సాకి

చెందిన పర్లాకిమిడి రెండూ జంటనగరాల్లాంటివి. ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని ఏలిన గజపతిరాజులమీద అభిమానంతో ఈ జిల్లాకు గజపతి జిల్లాగా నామకరణం చేసారు.

ఈ రోజుకీ నాటి గజపతుల వైభవాలను చాటే కట్టడాలు ఎన్నో అక్కడ మనకు కన్పిస్తాయి. ముఖ్యంగా పర్లాకిమిడి సంస్థానానికి చెందిన కోట. కేవలం చెక్కలతో కట్టిన అద్భుతమైన ప్యాలెస్, రాజభవనం ఇప్పటికీ చెక్కుచెదరకుండా నిలిచి వుండటం విశేషం.

అంబాసిడర్‌లో పర్లాకిమిడి సంస్థానానికి చెందిన రాజగురువు, ఆస్థాన పురోహితుడు, జ్యోతిషశాస్త్ర పండితుడు అయిన మున్నలూరు కృష్ణశాస్త్రి వున్నాడు. ఆయన వయసు డెబ్బై సంవత్సరాలు. పక్కనే వున్నది ఆయన మేనల్లుడు ముప్పై యేళ్ళ వేదాచారి. అతడు సంస్కృతం, ఆంధ్ర, ఒరియా భాషల్లో పండితుడు. వేదవేదాంగాలు చదివినవాడు. అవడానికి త్రిభాషా పండితుడేగాని చరిత్రలో చాలా వీక్. సాధారణంగా ఇక్కడ సరిహద్దు ప్రాంతాల్లో అందరూ తెలుగు, ఒరియా రెండు భాషాలూ ధారాళంగా మాట్లాడగలిగి వుంటారు.

కారును నెమ్మదిగా పోనిస్తున్నాడు డ్రైవర్.

“మావయ్యా! ఇప్పుడు మనం ఎక్కడికి వెళ్తున్నాం?” ఉన్నట్టుండి అడిగాడు వేదాచారి. వెకన సీట్లో కృష్ణశాస్త్రి పక్కనే కూచున్నాడు వేదాచారి.

“అదేమిట్రా అట్లా అడిగినావు? నువ్వీ ప్రాంతం ఎన్నడూ చూడలేదంటివి గదా. అందుకే పర్లాకిమిడి సంస్థానానికి నాతోబాటు తీసుకుపోతున్నాను. అక్కడ యిలా పిచ్చి ప్రశ్నలు వేయకుండా గప్‌చుప్‌గా ఉండాలి” అంటూ హెచ్చరించాడు కృష్ణశాస్త్రి.

“ఉంటాలేగానీ మావయ్యా! నేను హిస్టరీలో చాలా వీక్. తెలీక అడుగుతున్నాను. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడుపదులు

గావస్తున్నదిగదా. ఈ రోజుల్లోకూడ ఈ రాచరికాలు, సంస్థానాలు ఇంకా వున్నాయంటావా!"

ఓసారి మేనల్లుడి వంక చూసి-

భారంగా నిట్టూర్చాడు కృష్ణశాస్త్రి.

"నిజం చెప్పాలంటే లేవురా. నాటి రాజ్యాలు పోయాయి, రాజులూ పోయారు. కాని రాజ్యాలు ఏలిన నాటి రాజన్యుల వారసులు, వంశీకులు ఇప్పటికీ వున్నారు. దేశ భాషలందు తెలుగు లెస్సయని పలికిన ఆంధ్రభోజుడు, విజయనగర ప్రభువు కృష్ణదేవరాయలు. ఈ రాయలవారి వంశీకులు హంపి, విజయనగరం వద్ద తుంగభద్రానది ఆవలి తీరంలోని ఓ గ్రామంలో ఇప్పటికీ వున్నారు తెలుసా?"

"నాకు తెలీకే గదా మావయ్యా అడుగుతున్నాను. అయినా రాజ్యాలు పోయి ఇలా సంస్థానాలు ఎలా ఏర్పడ్డాయి?"

"ఊఁ! నీ ప్రశ్న చిన్నదేరా వేదాచారి కాని సమాధానం చాలా... చాలా పెద్దది. వీలున్నంత క్లుప్తంగా చెప్తాను విను. భారత ఉపఖండం నుండి బ్రిటిషర్లను తరిమికొట్టాలనే లక్ష్యంతో 1857వ సంవత్సరంలోనే మొదటి స్వతంత్ర యుద్ధం జరిగింది. వీరనారి ఝాన్సీలక్ష్మీబాయితోబాటు ఎందరో రాజులు, సైనికులు వీరమరణం చెందారు. పోరాటం కర్కశంగా అణచివేయబడింది.

బహదూర్‌షా జాఫర్- ఇతను మొగలాయీ పాలకుల్లో చిట్టచివరివాడు. ఔరంగజేబు మనవడు. స్వాతంత్ర్య స్ఫూర్తి ప్రదాత. ఆ యుద్ధంలో బ్రిటిషర్లకు ప్రాణాలతో చిక్కి సంవత్సరకాలం తర్వాత జైల్లోనే కాలం చేసాడు.

ఆ యుద్ధం తర్వాత రాజ్యాలను అలాగే వుంచితే బలపడి మరో తిరుగుబాటు చేస్తారని బ్రిటిషు పాలకులకు భయంపట్టుకుంది. దాంతో

తమ గొడుగు కింద వున్న రాజుల అధికారాలను కుదించటం ఆరంభించారు. సైనిక బలగాల్ని తగ్గించుకునేలా చేసారు. రక్షణ పేరుతో తమ బ్రిటిష్ సైన్యాలను వుంచారు. ఆ ఖర్చంతా ఆయా రాజులే భరించాలి.

అంతటితో ఆగకుండా సంధి ఒడంబడికలతో క్రమంగా రాజ్య భాగాలను, భూముల్ని లాక్కున్నారు. ఆవిధంగా రాజ్యాలు కుదించుకుపోయి చిన్నాపెద్ద సంస్థానాలుగా మారిపోయాయి. తాము లాక్కున్న భూముల్ని, ప్రాంతాలకు తాబేదార్లుగా తమ తొత్తులుగా పనిచేస్తున్న వారికి కట్టబెట్టి జమిందారీ వ్యవస్థకు తెరతీసారు.

ఇండియాకు స్వాతంత్ర్యం వచ్చే నాటికి ఉపఖండంలో దాదాపు ఆరు వందలకుపైగా సంస్థానాలుండేవి. స్వతంత్రం వచ్చాక అవన్నీ ఇండియాలో విలీనమయ్యాయి. వాటిలో ఒకటి ఈ పర్లాకిమిడి సంస్థానం" అంటూ వివరించాడు.

"మరి... మన మున్నలూరు గ్రామం ఏ సంస్థానంలో వుండేది మావయ్యా?" మరోప్రశ్న సంధించాడు వేదాచారి.

కృష్ణశాస్త్రి స్వస్థలం అమరావతి కావల కృష్ణా తీరప్రాంతంలోని మున్నలూరు గ్రామం. కృష్ణశాస్త్రి మేనల్లుడి వంక నవ్వుతూ చూసాడు.

"ఏమిరా! ఇదికూడ నేను చెప్పాలా? రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు సంస్థానం. ధరణి కోటలో వుండేది" అన్నాడు.

"అవునా...! మరి పక్క రాష్ట్రాల్లోకూడ ఇలా సంస్థానాలు వుండేవా?"

"చెప్పాగా... తమ గొడుగు కిందవున్న అన్ని ప్రాంతాల్ని ఇలా సంస్థానాలుగా కుదించేసారు బ్రిటిష్‌వాళ్ళు. మహారాష్ట్రలో కొల్లాపూర్ సంస్థానం, తమిళనాడులో కుంభకోణం వద్ద రుక్మణి సంస్థానం,

తంజావూరు జిల్లాలో పుదుకొట్టై సంస్థానం, రాజస్థాన్‌లో బికనీర్, ఉదయ్‌పూర్ సంస్థానాలు, ఎట్టాయపురం, తమిళనాడు వీటిని ప్రముఖంగా చెప్పుకోవచ్చు"

"బాగుంది... ఆంధ్రాలో సంగతేమిటి?"

"చాలా... చాలా సంస్థానాలుండేవిరా. బొబ్బిలి సంస్థానం బొబ్బిలి, పాండవులమెట్ట వద్ద పెద్దాపురం సంస్థానం, జగ్గయ్యపేట ముత్యాల వద్ద ముత్యాల సంస్థానం, వనపర్తి సంస్థానం, గద్వాల్ సంస్థానం, నెల్లూరు దగ్గర వెంకటగిరి సంస్థానం, విజయవాడ వద్ద చల్లపల్లి సంస్థానం అలాగే నూజివీడు సంస్థానం కొండవీడు, సిద్ధవటం, పిఠాపురం, కపిలేశ్వరపురం, ముత్యాల, చల్లపల్లి, కొండారెడ్డి, పూసపాటి, విజయనగరం, రాజపేట, నల్గొండ, దేవరకొండ, ట్రావెంకూర్ ఇలా చాలా వుండేవి."

"అర్థమైంది మావయ్యా. ఇప్పుడు మనం వెళ్తున్న పర్లాకిమిడి సంస్థానం గురించి చెప్పు? పూర్వం కళింగదేశం అనేవారు దీన్నే కదూ?"

"కాదు... కళింగదేశ రాజధానీ కళింగపురం. అది మధ్య ఒరిస్సా ప్రాంతంలో వుంది. నువ్వు తిరిగి ప్రశ్నలతో విసిగించకుండా క్లుప్తంగా చెప్తాను విను.

పూర్వం ఇక్కడి ప్రజల్ని కాళింగులని వ్యవహరించేవారు. కాళింగులు నివశించే ప్రాంతంగాబట్టి కళింగదేశం అయింది. వీరు మాట్లాడేది ఒరియా భాష గాబట్టి దీన్ని ఓఢ్రదేశం అనికూడ పిలిచేవారు. ఖారవేలుడు వంటి మహావీరులు పాలించిన ప్రాంతం యిది. అశోక చక్రవర్తి అంతటి వాడే కళింగ యుద్ధంలో గెలిచినా లక్షలాది మంది వీరుల మరణం చూసి చలించిపోయాడు. తర్వాత యుద్ధాలు మాని బౌద్ధమతం అవలంభించాడంటే ఆ యుద్ధ బీభత్సాన్ని వూహించుకోవచ్చు.

తర్వాతి కాలంలో ప్రస్తుతం ఒరిస్సాగా పిలుస్తున్న ఈ ఓఢ్రదేశం గజపతుల వశమైంది. ఈ గజపతుల ఆడపడుచే విజయనగర సామ్రాట్టు శ్రీకృష్ణదేవరాయలవారి పట్టమహిషి అన్నపూర్ణాదేవి.

ఇక ఈ గజపతులు మలయా గిరిజన జాతికి చెందిన గజపతి వంశీయులు. సుమారు ఏడు వందల సంవత్సరాలు పరిపాలించారు. ఒకానొకప్పుడు వీళ్ళ రాజ్యం ఉత్తరాన గంగానది నుండి దక్షిణాన నెల్లూరు వద్ద వెంకటగిరి వరకు వ్యాపించి వుండేది. అదే ఈస్టరన్ గంగా డైనాస్టీ.

బ్రిటిషర్ల కుట్రలతో ఇక్కడ కూడ అనేక సంస్థానాలు ఏర్పడ్డాయి. వాటిలో ఈ పర్లాకిమిడి సంస్థానం పెద్దది. నీకు మరో విషయం చెప్పాలి- మనకి స్వతంత్రం వచ్చాక అనేకమంది సంస్థానాధీశులు ఇటలీ, అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి విదేశాల్లో సెటిలయ్యారు. పోయినవిపోగా కోటలు, ప్యాలెస్‌లు, వేలాది ఎకరాల భూములు, ఎస్టేట్‌లు యిక్కడే వున్నాయి. వేలకోట్లకు అధిపతులు. కొందరికి విదేశాల్లోనూ, ఇక్కడా కూడ వ్యాపారాలున్నాయి. ఆదాయ వనరులున్నాయి. రాజ్యాలు పోయినా అదే రాజసం, హుందాతనం, విలాసవంతమైన జీవితం వారి సొంతం. సంవత్సరానికి రెండేళ్ళకో సంస్థానాలకు వచ్చిపోతుంటారు. వాళ్ళ తరఫున ఇక్కడ బంధువులు, నమ్మకమైన పని వాళ్ళు వారి ఆస్తుల్ని పరిరక్షిస్తుంటారు. ఆ కాలంలో ఒక రాజు కుటుంబం మరో రాజు కుటుంబంతోనే సంబంధ బాంధవ్యాలు నెరపేది. మతాలు, దేశాలు, భాషలతో పనిలేదు. అదే సాంప్రదాయం సంస్థానాధీశులు ఇప్పటికీ పాటిస్తూంటారు" అంటూ చెప్పటం ఆపాడు కృష్ణశాస్త్రి.

"చాలా ఆశ్చర్యకరమైన విషయమే మావయ్యా. ఇంతకీ పర్లాకిమిడి సంస్థానాధీశుడు ఎవరు?" కుతూహలంగా అడిగాడు వేదాచారి.

"అక్కడికే వస్తున్నాను. ప్రస్తుతం పర్లాకిమిడి సంస్థానాధీశుడు రాజా విష్ణుచంద్ర గజపతి మహాదేవ్. ఈయన వారసురాలు ఒకే ఒక్క కూతురు. బిడ్డ పుట్టిన కొద్దిరోజులకే భార్య గతించింది. కూతురు పేరు యువరాణి సౌందర్యానంద సహనాదేవి. ఈ అమ్మాయికి ముప్పై సంవత్సరాలలోపు ప్రాణగండం వుందని అప్పట్లో జాతకచక్రం చూసి నేనే చెప్పాను. ఈ విషయాన్ని తమిళనాడు సత్యానంద స్వామి కూడ బలపర్చారు. దాంతో ఆ పాపను మూడో ఏటనే లండన్ తీసుకుపోయి అక్కడే సెటిలయిపోయారు.

యువరాణీ వారికిపుడు ఇరవై నాలుగు సంవత్సరాల వయసు. యుక్తవయస్కురాలు. కాని ఆమె ఎలా వుంటుందో ఇక్కడ తెలిసిన వాళ్ళు ఎవరూ లేరు. ఇండియా తీసుకొస్తే ముప్పు కలుగుతుందన్న భయంతో ఎప్పుడు వచ్చినా రాజావారు మాత్రమే ఇక్కడికొస్తారు. ఎంత జాగ్రత్త వహించారంటే కనీసం ఆయన ప్యాలెస్‌లో కూడ వెతికి చూద్దామన్నా రాజకుమారి సహనాదేవి ఫోటో కన్పించదు" అంటూ వివరించాడు కృష్ణశాస్త్రి.

"అలాగునా! నాకు తెలీకడుగుతాగాని మావయ్యా... నిజంగా ప్రాణగండం వుంటే దాన్ని ఎవరు మాత్రం తప్పించగలరు చెప్పు? ఇక్కడవున్నా లండన్‌లోవున్నా చావు తప్పదుగదా" అనడిగాడు వేదాచారి.

"నిజమే అనుకో! కాని ఇది ఆ అమ్మాయి జాతకరీత్యా శత్రువుల నుంచి ఎదురయ్యే ప్రాణగండం. కాని ఆ శత్రువులెవరో తెలీదాయె. అందుకే తన కూతురు విషయంలో రాజావారు ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. పోతే ఇక్కడ వారి ఆస్థుల్ని రక్షిస్తున్నది, వ్యవహారాలు చక్కబెడుతున్నది సూర్యప్రకాశవర్మగారని రాజావారి బావమరది. అంటే ఆయన భార్య తమ్ముడు. ఆయన సరిగా నడవలేడు. ఎక్కువ సమయం వీల్‌ఛైర్‌లోనే గడుపుతాడు.

రాజావారు ఎప్పుడు వచ్చినా వెంటనే ముందుగా నాకు ఫోన్‌చేసి పిలిచేవారు. ఈసారి నాలుగు రోజులు ఆలస్యంగా పిలిచారు. కారణం తెలీదు. చూద్దాం!" అంటూ భారంగా నిట్టూర్చాడు కృష్ణశాస్త్రి.

వేదాచారి వద్ద ఇంకా చాలా ప్రశ్నలు మిగిలే వున్నాయి. కాని అప్పటికే పర్లాకిమిడి వీధులు దాటి కారు కోట గుమ్మాన్ని సమీపించింది. ఎత్తయిన కోట గోడలు, నిటారుగా నిలబడిన కోట గుమ్మం, బలమైన చెక్క తలుపులు కనబడగానే ప్రశ్నలు గొంతులోనే ఆగిపోయాయి. ఆశ్చర్యోద్వేగంతోఅలా చూస్తుండిపోయాడు. సడెన్‌గా తాము రాజుల కాలంనాటి ఏదో కోటకు చేరువైనట్లనిపిస్తోంది.

కోటగుమ్మం వద్ద బలిష్టులైన సెక్యూరిటీ సిబ్బంది నలుగురు కత్తులు, బళ్ళాలు ధరించి కాపలా వున్నారు. రాజగురువు కృష్ణశాస్త్రి కారు వాళ్ళకి సుపరిచితమే. వాళ్ళంతా గౌరవంగా పక్కకు తొలగి నమస్కరించారుగాని ఆపే ప్రయత్నం చేయలేదు.

కారు కోటగుమ్మం దాటి కొంతదూరం వెళ్ళి మలుపు తిరిగి ఒక అద్భుతమైన ప్యాలస్ ముందు విశాలమైన పోర్టికోలోకొచ్చి ఆగింది. ఆ సమయంలో రాజావారి బావమరిది సూర్యప్రకాశవర్మ ఎవరితోనో మాట్లాడుతూ కన్పించాడు. ఆయన గత కొద్ది సంవత్సరాలుగా మోకాళ్ళ నొప్పులతో బాధపడుతున్నాడు. ఎక్కువసేపు నిలబడలేడు, నడవలేడు. అధిక సమయం వీల్‌ఛైర్‌లోనే గడుపుతాడు.

కారు దిగుతున్న కృష్ణశాస్త్రిని చూడగానే వీల్‌ఛైర్‌ని తోసుకుంటూ దగ్గరకొచ్చి నమస్కరించాడు.

"గురుదేవులకు ప్రణామాలు. రండి రండి... మున్నలూరు నుంచి ప్రయాణం సుఖంగా సాగినదిగదా!'' అంటూ చిరునవ్వుతో ఆహ్వానించాడు.

"దీర్ఘాయుష్మాన్భవ! ప్రయాణం బాగానే సాగింది నాయనా. మీ ఆరోగ్యం ఎలా వుంది? కుశలమే గదా?" ఆశీర్వచనంతోబాటు పరామర్శించాడు కృష్ణశాస్త్రి.

"భగవంతుని కృప, తమ అనుగ్రహం. అంతా కుశలమే స్వామీ. ఇతను ఎవరు?" వేదాచారిని చూస్తూ అడిగాడు వర్మ.

"నా మేనల్లుడు వేదాచారి" అంటూ పరిచయం చేసాడు కృష్ణశాస్త్రి.

"మంచిది స్వామీ! రాజావారు బయటికెళ్ళినారు. వచ్చే సమయమైనది. అల్పాహారం సేవించి మీరు తమ గదిలో విశ్రాంతి గైకొనండి. కబురు చేస్తాం" అంటూ ఒక నౌకర్ని వెంట పంపించాడు సూర్యప్రకాశవర్మ.

వేదాచారితో తనకు సుపరిచితమైన ప్యాలస్‌లోకి అడుగుపెట్టాడు మున్నలూరు కృష్ణశాస్త్రి. ఈలోపల ఆయన డ్రైవరు కారును దూరంగావున్న పార్కింగ్ ప్లేస్‌లోకి తీసుకుపోయాడు. అప్పటికే అక్కడ బైక్‌లు, ఖరీదైన కార్లు చాలా వున్నాయి. అవన్నీ రాజా విష్ణుచంద్ర గజపతి మహదేవ్ వారి దర్శనం కోసం వచ్చి ఎదురుచూస్తున్న వి.ఐ.పి.లు, ముఖ్యమైన అధికారులవి.

* * * * *

సరిగ్గా భూగోళం ఆవలి పక్కన–

ఇక్కడ పగలయితే అక్కడ రాత్రి.

అదే దక్షిణ అమెరికా ఖండం.

లాటిన్ అమెరికాలోని కొలంబియా దేశం ఉత్తరభాగం... దట్టమైన అటవీ ప్రాంతం.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Manishilo+Manishi+1**

* * *